# ఆడపిల్లల పరిహాసం

(కథానిక)

ఆఫీసు ఫైల్స్‌ని విసుగ్గా పక్కకు నెట్టి భార్య వేపు చూశాడు రాము. తన పిలుపు అప్పటికి గాని అతడి చెవిని పడింది కాదని గ్రహించింది అతని భార్య - రమ.

"ఏమండీ, వసు పెళ్ళిమాట ఏంచేశారు?"

"అదే చూస్తున్నా. ఊరికే కూర్చోలేదు గద. నాకొచ్చే నూట యాభైరాళ్ళలో కొన్ని రాళ్ళు యీ ఖాతా క్రింద చాలాకాలంనుంచీ వెచ్చబెట్తున్నాను. ఫలితం చెప్పులు చిరగడమే గాని వేరే ఏం కనపడటం లేదు" అని జుగుప్సగా 'ఫీలవుతూ' రాము తన చేతివ్రేళ్ళను జుట్టులోకి తోసుకుంటూ సోఫాలో చేరగిలబడ్డాడు.

వసుంధర చటుక్కున గదిలోకి వచ్చింది. పుస్తకాల బీరువా వెతికి ఒకపుస్తకం పట్టుకుని వెళ్తూ బావకేసి, అక్కకేసి ఒకసారి చూసింది. రమ అందుకున్నది.

"అట్లా అంటే ఎలా చెప్పండి? ఈడు మీరుతున్నది. మనం కట్నాలు యిచ్చుకోగలమా, కానుకలిచ్చుకోగలమా? ఏదోమూడుముళ్లు అయిందనిపిస్తే కృతార్థులం. యింతకూ పెద్దవాళ్లు యీ భారాన్ని మనమీద వేశారు గనుక."

"అవునా, ఏకుర్ర వెధవైనా ఒప్పుకోకూడదూ? పిల్ల స్కూలుఫైనలు దాకా చదివిందాయె, అందానికి లోపంలేదాయె! తెలివిగల పిల్ల! కట్నం లేందే ఎవడూరాండే? అందులోనూ యీ రోజుల్లో ప్రతివాడికీ ఒకటే పాట, అయిదు వేలిస్తావా? పదివేలిస్తావా?"

"ఇంతకీ దాని దురదృష్టం! నా పెళ్ళికాలే- కానీ కట్నంలేకుండా?" అన్నది రమ.

* * *

"దురదృష్టం!"... ఈ మాటే వసుంధర చెవుల్లో గంటలు కొట్టినట్లు మ్రోగుతోంది. తనకు పెళ్ళికాకపోవటం దురదృష్టం? తనకు కట్నమిచ్చి అయినా పెళ్ళి చేయగల తాహతు తన బావకు లేకపోవటం తన దురదృష్టం! ఇరుగు పొరుగువాళ్ళు ముక్కుమీద వేలేసుకుని తనని గురించే తన అక్కని ప్రశ్నలు వేయటానికి కారణమైన తన రూపురేఖలకుతోడు, తన వయసులో పెళ్ళికాకపోవటం తన దురదృష్టం! సంఘంలో కొన్ని వర్గాలు యీయీతిబాధల్లో నలగటానికీ, కొన్ని వర్గాలు యీయీతి బాధల నుంచి స్వేచ్ఛ పొంది సుఖంగా వుంటానికి కారణం? తన దురదృష్టానికి కారణం? తమకు 'సిరి' లేక పోవటమే!

"తనని స్వేచ్ఛగా వుండనిస్తుందా సంఘం?"

"లేదు!" సంఘం - తన చావుబతుకుల్తో పనిలేని సంఘం, తన పెళ్ళికి "కానీ" సహాయం చేయలేని సంఘం, తన "స్వేచ్ఛ"ని చూచి కళ్లెర్రజేస్తుంది. గర్జిస్తుంది. పరిహాసిస్తుంది... సంఘానికి తనెవరు? వసు బిక్కమొహంతో అక్కయ్యని సమీపించి తనకు పెళ్ళి కాకపోతేనేం? అని అడిగింది. "ఛా! నోర్మూసుకో. నీకు తెలియదులే" అని గద్దించింది అక్కయ్య.

* * *

ఊళ్ళూ, యిళ్ళూ, కాలేజీలూ, హాస్టళ్ళూ, సాకల్యంగా పరీక్షించటం సాగించాడు రాము. ఎంత వెతికినా, తన పరిస్థితులకు అనుకూలించే సంబంధాన్ని కుదర్చలేక పోయాడు. తాను గవర్నమెంటు ఆఫీసులో అప్పర్ డివిజను గుమాస్తా. తనకు పెళ్ళిఅయిన అయిదేళ్ళలోనూ తను మిగిల్చిం దేమీలేదు. తాను అనుభవించింది అంతకంటే కనపడలేదు. ఎట్లాగో కష్టపడి మరదలుకు స్కూలు ఫైనలుదాకా చెప్పించాడు. కాలేజీ చదువుకు తన దగ్గర డబ్బులేదు. ఇహ పెళ్ళి చేయాలి? చేయకపోతే యీడువచ్చిన మరదలిని యింట్లో పెట్టుకు కూర్చుంటే సంఘం, తనచుట్టూ వుండే సంఘం ఊరుకుంటుందా? "అప్రతిష్ట" అని రాత్రిం

శ్రీ కృష్ణప్రసాద్

బగళ్ళూ రమ గోల.

రమ మెడలోఉన్న కాసిని నగలూ, ఇంట్లో కనబడ్డ ప్రతి వెండి, బంగారు వస్తువూ అమ్మి దానికి కొంత "అప్పు" చేర్చి పెళ్ళి ఖర్చులు తయారుచేశాడు. ఒళ్లు దాచుకోకుండా వాడ వాడా తిరిగి ఎట్లాగో చివరకి ఒక సంబంధం కుదర్చగలిగాడు.

పిల్లవాని పార్టీ "కట్నంపాట" కొద్దిలోనే ముగించారు. "అప్పుచేసైనా తేలేకపోతానా" అన్న మొండి ధైర్యంతో రాము ఆ సంబంధం ఖాయంచేశాడు. ఉన్న కొద్దికాల వ్యవధిలో కట్నం అనుకున్న నాలుగువేలూ తేవాలి. ఎక్కణ్ణుంచి తేగలడు? ఎన్నిరకాలుగానో ఆలోచించాడు. సలహా పడ్డాడు. అప్పు ఎవరు యిస్తారు? కనబడ్డ ప్రతి పరిచితుణ్ణీ అడిగాడు. అంతా ఎవరి సంసారం గొడవలు వాళ్లేకరువు పెట్టారు. తాను అమ్మివేయ గల్గిందల్లా అమ్మివేశాడు. నాలుగువేలూ పూర్తికాలేదు! పెళ్ళివాళ్ళు ముహూర్తం పెట్టుకుని వచ్చి విడిది వేశారు. రాముకు అడకత్తెరగా తోచింది.

రమ సలహామీద గబగబా మార్వాడీ దగ్గరకు పరుగెత్తాడు. తనదగ్గర ఏంచూసి ప్రామిసరీ నోటు వ్రాయించుకుంటాడు? ఆశ నిరాశ ఐంది. ముహూర్తం ఆగటానికి లేదు! ఎట్లాగైనా ఆగటానికి వీల్లేదు! పట్టుదలతో కార్యాని కుపక్రమించేడు. కట్నం చదివించే సమయం వచ్చింది. రాము వరుడి మేనమామని, అతని భార్యని చాటుకు పిల్చి బ్రతిమాలి, తన కష్టాన్ని చెప్పుకున్నాడు. ఎట్లాగైనా తరువాత చెల్లిస్తానన్నాడు. వరుడి మేనమామ భగ్గున మండిపడ్డాడు.

పెళ్ళి ఆగిపోయింది. వసు నిర్విణ్ణ అయింది. మేనమామ ఆజ్ఞ జవదాటలేక వరుడు, తన వాళ్ళ వెంట నిష్క్రమించాడు. కట్టబోయే మంగళ సూత్రం, ఠక్కుమని జారి పళ్ళెంలోనే పడివుంది. పురోహితుడి నోట్లో మాట నోటోనే వుంది. రమ పిచ్చిచూపుల్తో పేరంటాళ్ళ వైపు చూసింది. ముసిముసి నవ్వుల్తో వాళ్లు ఎవరి దోవ వారు పట్టారు. రాము జుట్టు పీక్కుంటూ ఏమూలో కూలబడ్డాడు. వచ్చిన అతిథి బృందం విసుక్కుంటూ, విమర్శిస్తూ వెళ్లిపోయారు.

* * *

వసు కంటిలో నీటి చుక్క లేదు. రాముని సమీపించింది. "ఏం బావా? నామూలాన్నే కదా నీకీ కష్టమంతా? నా దురదృష్టం. ఈ పాడు సంఘంలో ఆడపిల్లలంతా చేసుకున్న పుణ్యఫలం యీ దురదృష్టం. నీవేం చేస్తావు?" అని ఓదార్చబోయింది.

"వసూ, కష్టపడ్డాను. ఫలించలేదు. నావంటి దరిద్రుడుకి తోడు యింత పెద్ద భారంకూడా!" అన్నాడు రాము ఆవేదనతో.

అప్పు లిచ్చినవాళ్ళు రాముని పీక్కుతినటం సాగించారు. కోర్టుకు కూడా ఎక్కించారు. రాము నిద్ర ఆహారాలకు దూరమై, విచారంతో కృంగిపోతున్నాడు. రమకు అశాంతి ఎక్కువైంది. వసుకు తన జీవితమే అసహ్యం అయింది.

ఒక రోజు బావను సమీపించి, చిరునవ్వుతో చెప్పింది.

"బావా, క్షణంలో మీ చింతలన్నీ తీర్చేస్తాను చూడు. స్త్రీ శక్తిస్వరూపిణి. స్త్రీ తల్చుకుంటే చేయలేనిది లేదు. చూడు బావా, నా పెళ్లికి మీరంతా త్యాగం చేసికూడా పెళ్ళి చేయలేక అవమానపడ్డారు. ఆ త్యాగం నేనే చేస్తే...?" ఈ మాటలు విని అక్కా, బావా ఆశ్చర్యపడ్డారు.

* * *

నాలుగు రోజులపాటు వసుంధర యింట్లో కనిపించకపోయేసరికి రామూ, రమా కళవళపడ్డారు. తెలిసిన చోటల్లా దర్యాప్తు చేశారు. చుట్టుప్రక్కల జనం ఆశ్చర్యంగా, హేళనగా ముక్కుమీద వేలేసుకొని విమర్శించారు. "తీసిన అప్పులు తీర్చకపోతే, జైలు వాసం" అని న్యాయస్థానం న్యాయంచెప్పింది.

"రాము "మరదలు పెళ్ళి" కోసం. "జైలు వాసం" అనుభవించబోతున్నాడు" అని అంతా హేళనగా చెప్పుకున్నారు.

రాము పోలీసులతో బయలుదేరే సమయానికి వాకిట్లో కారు ఆగింది. కారులోనించి వసుంధర, వెనకాల ఒక వృద్ధ శ్రీమంతుడు దిగారు. "బావా, తర్వాత చెప్తాను పద. ఈ

నోట్లు తీసుకుని ముందు నీ చెర వదిలించుకుని రా–'' అని నోట్లకట్టలు చేతుల్లో పెట్టి కారులో ఎక్కించుకొని న్యాయస్థానానికి వెళ్ళేరు. గబగబా బాకీలు ఫైసలు చేసుకుని వచ్చారు. రమకి ఆశ్చర్యంతో,సంభ్రమంతో నోటమాటరాలేదు.

రాము వసుకేసి ఆశ్చర్యంగా చూస్తూ నిల్చుండిపోయాడు.

"బావా, ఈయనే నా భర్త. ఎందుకలా ఆశ్చర్యపడుతున్నారు? వృద్ధాప్యం పడిలో వున్నారనా? అయితేనేం? సామాన్యులకు ఎవరికీలేని "సిరి" వుందికదూ? ఇప్పుడు నేను శ్రీమంతురాలిని! ఒకప్పుడు నాది దురదృష్టం! ఇప్పుడు అదృష్టం! మీరో, ఒకప్పుడు మరదలి పెళ్ళి చేయలేక సంఘంలో అప్రతిష్ఠపడ్డారు! ఇప్పుడో శ్రీమంతురాలైన మరదల్ని పొంది అదృష్టవంతులైనారు! ఇహ సంఘం మిమ్మల్ని శ్లాఘిస్తుంది'' అన్నది వసు అక్కబావలతో.

రాము, రమ ఒకరొన్నొకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు. వసు డగ్గుత్తికతో అంది: "ఎందుకలా చూస్తున్నారు? వృద్ధభర్తతో నా సౌఖ్యం గురించా? సంఘాన్ని ఈర్ష్యతో కుళ్ళబెట్టడానికి కావలసినంత "సిరి" వుంది నా దగ్గర యిప్పుడు! చాలు. అందులోనే వుంది నేటి నా సౌఖ్యం–ఆనందమంతా!'' అంటూ వసు నవ్వింది. ఆ నవ్వులో కట్నాల కోసం సౌఖ్యాల్ని త్యాగంచేసిన ఆడపిల్లల పరిహాసం ధ్వనించింది!

# క్షణంలో సగం

"శారద"

సలహా "ఉచితం". ఈ జన్మనించి ఇంకో జన్మమధ్య స్వర్గానికి రహదారి 'వీసా' ఇచ్చేందుకు. వేదాంతం వేళ్ళుపాతుకుని పోబట్టే, ఇంకా భూతాలూ దెయ్యాలూ సినిమాల్లోనించి వొదలటంలేదు.

దేశానికి కరువు తీరిపోయింది. ఉపన్యాసాల కరువుమాటే, అన్నం కరువు మాట కాదు. ఎన్ని లక్షలటన్నులు అమెరికానుంచి దిగినాసరే, సరాసరి సాక్షాత్తు భగవంతుడే ధాన్యం కురిపించినా సరే, అది దొరికే వారికే కాని, అందరికీ లభ్యంకాదు. కరువూ తీరదు. ధాన్యం రాసులున్నా రవాణా సమస్య. రవాణా తేలిందనుకోండి, 'డిపో' ప్రభువు ఆజ్ఞ. మొత్తానికి తప్పాల పొయ్యి ఎక్కదు.

ఏదేశంలోనో 'ఇనపతెరలు'న్నాయంటారు. ఈదేశం సంగతులు, ఈ నిరుపేదల ఆకలి క్షోభలు, గుడ్డల కరువూ ఇతరులకు తెలియనిస్తున్నారా? ఇక్కడజరిగే బ్లాక్‌మార్కెటూ అన్యాయాలూ, ఇతరులు కథలు కథలుగా ఆశ్చర్యంగా చెప్పుకుంటారు. వెనకటి 'తుగ్లక్' పరిపాలనకన్న ఘోరమైన 'అరేబియన్ నైట్స్' కథలు ఇవి. బయటనించి వొచ్చే వాళ్ళకి మనం చూపించేవి బొంబాయిలో మేడలు, మద్రాసులో బీచీ, కరాచీలో పార్కులున్నూ!

ఇరాన్‌లో పెట్రోలు పొగలు ప్రపంచాన్ని ఆవరించేట్టు కనిపిస్తున్నాయి. బ్రిటిష్ వారి న్యాయం ఓడల్లో దిగుమతి అవుతుందిట. సరాసరి అంతర్జాతీయ న్యాయస్థానంనించే.

విలాసరావు ఉండిఉండి గభీమని సినీ రంగంలో దిగాడు. పట్టాడు ఓ బంగారు పిచ్చికను. తీసాడు ఓ చపటచిత్రాన్ని. గమ్మత్తు ఏమంటే, కథ రాసిందీ దర్శకత్వం ఏడ్చిందీ. అన్నీ తనే. పిక్చరువిడుదల కాకుండా ఎట్లాగా వుండదు. ఆ కథలో గొప్పతనం ఏమిటో తెలుసా? చెబితే 116 బహుమతి. ఈ ప్రశ్నకు విలాసరావే సమాధానం ఇచ్చాడు. (ఇతర్లు ఎవరైనా చెబితే కోపమాయె చచ్చి!) "నా ఫిలింలో ఎక్కడ ఎన్ని వేల అడుగులు కత్తిరించినా "కథ" నడుస్తుంది. ఎక్కడ ఎన్ని వేల అడుగులు కొత్తగా కలిపినా కథ మామూలుగానే నడుస్తుంది'' అని. ఈ అభ్యుదయ ఛాలెంజీతో పత్రికా విమర్శకులు కళ్లు కలం గూడా మూసుకున్నారు!